క్లుప్తంగా

హనుమాన్ ఆలయ అభివృద్ధికి విరాళం

పిట్లం: మండలంలోని పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయ నిర్మాణానికి పిట్లంకు చెందిన వ్యాపార వేత్త రూ. 2 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన పానుగంటి హనుమాన్లు రూ. 51 వేలు, బాన్సువాడకు చెందిన ఎర్రవల్ల కృష్ణారెడ్డి రూ. 21 వేలు విరాళం అందజేశారు. ఆలయ నిర్వాహకులు తేజస్వామి మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేత



రాజంపేట: మండలం గుండారంకు చెందిన భీమరి లక్ష్మి కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో సమాచారం తెలుసుకున్న మదన్ మోహన్ ట్రస్ట్ సభ్యులు బాధితురాలికి శనివారం ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేశారు.

వేగంగా గదుల నిర్మాణం



నిజాంసాగర్: మండలంలోని కొమలంచ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ. 18 లక్షలతో అదనపు గదుల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. దీనికి తోడు మన ఊరు మనబడి కార్యక్రమం కింద మరో రెండు అదనపు గదుల నిర్మాణానికి రూ. 22 లక్షలు మంజూరు అయ్యాయి. గదులు పూర్తయితే విద్యార్థులకు కష్టాలు తప్పుతాయి.

సేవాలాల్ దీక్షల స్వీకరణ

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని పలువురు సేవాలాల్ దీక్షలను స్వీకరించారు. మహాశివరాత్రి నుంచి శ్రీరామనవమి వరకు 41 రోజుల పాటు దీక్ష చేయనున్నట్లు సేవాలాల్ స్వాములు తెలిపారు. అనంతరం సేవాఘడ్ వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన

లింగంపేట: మండలంలోని లింగంపల్లి (ఖుర్దు) ఎల్లారం హనుమాన్ మందిరం వద్ద శనివారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గుంపులుగా రోడ్లపైకి వానరాలు



బాన్సువాడ రూరల్: వానరాలు వనాలను వదిలి గ్రామాల్లోకి వచ్చి ప్రజలు బెంబేలెత్తిస్తున్నాయి. కోతుల గుంపు రోడ్లపై నిత్యం ఉండటంతో అటువైపు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. మండలంలోని కొత్తాబాది, తాడ్కోల్, బోర్లం, ఇబ్రాహింపేట్, రాంపూర్, దేశాయిపేట్ గ్రామస్తులు కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆర్థిక సహాయం

కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్‌కు చెందిన బాలకిషన్ అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో డీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

శివుడి విగ్రహావిష్కరణ



రుద్రూర్: మండలంలోని రాణంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన వైకుంఠధామంలో శనివారం శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన దాత దయాల గంగామణి–సాయిలు కుటుంబ సభ్యులు తపస్సులో ఉన్న శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

బోధన్: బోధన్‌ను ప్రత్యేక జిల్లా ప్రకటించాలని పట్టణంలో న్యాయ వాదుల రిలే నిరాహార దీక్షలు శనివారం కూడా కొనసాగాయి. న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి, న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు, బీజేవైఎం అధ్యక్షుడు వెంకటేష్ దీక్షలో పాల్గొన్నారు.

జన సంద్రమైన శైవ క్షేత్రాలు..

- ఉదయం నుంచే ఆలయాల్లో బారులు తీరిన భక్తులు
- పలు ఆలయాల్లో సామూహిక రుద్రాభిషేకాలు
- పూజలు నిర్వహించిన రాజకీయ పార్టీ నేతలు



కామారెడ్డి వీక్లీ మార్కెట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు



కామారెడ్డిలో..



మాచారెడ్డి మండలం బందరామేశ్వర్‌పల్లి ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

సాక్షి, నెట్‌వర్క్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా శివలింగాలకు అభిషేకం నిర్వహించారు.

మాచారెడ్డి మండలం బండ రామేశ్వర్‌పల్లిలోని రాజరాజేశ్వర అమ్మవారికి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ పట్టు వస్త్రాలు అందించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు పూజలు నిర్వహించారు. రామారెడ్డి మండలం బుగ్గరామలింగేశ్వరుడి కల్యాణోత్సవంలో షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎంపీపీ దశరథ్‌రెడ్డి, సర్పంచ్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు శ్రీ సిద్దరామేశ్వరాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ పునర్ నిర్మాణకమిటీ అధ్యక్షుడు అందే మహేందర్‌రెడ్డి, ఈవో శ్రీధర్ ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కామారెడ్డి పట్టణంలోని రామేశ్వర్‌పల్లి శివాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. దోమకొండలోని శివరాంమందిర్‌లో గంగన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి కల్యాణంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అబ్రబొయిన రాజు, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు శ్రీను పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని నీలకంఠేశ్వరాలయంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాన్సువాడలో నిర్వహించిన శివలింగం శోభయాత్రను డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలోని రేణుకా ఆలయం వద్ద భక్తులు గడ్డితో తయారు చేసిన శివలింగం భక్తులను ఆకట్టుకుంది. భిక్కనూరు శ్రీసిద్దరామేశ్వరాలయంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ పూజలు నిర్వహించి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.



నిజాంసాగర్ చంద్రమౌళీశ్వరాలయంలో..



కామారెడ్డి శ్రీశారదామాత ఆలయంలో శివ లింగానికి అభిషేకం చేస్తున్న చిన్నారి



బందరామేశ్వర్‌పల్లి రాజేశ్వరాలయంలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు వెంకటరమణారెడ్డి



కామారెడ్డిలోని శివాలయంలో..



నాగిరెడ్డిపేట మండలంలోని త్రిలింగేశ్వర ఆలయంలో..



భిక్కనూరు శ్రీసిద్దరామేశ్వరాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



మాచారెడ్డి మండలం బందరామేశ్వర్‌పల్లిలో..



కామారెడ్డి శ్రీవిశ్వనాథేశ్వరస్వామి ఆలయంలో..



భిక్కనూరు శ్రీసిద్దరామేశ్వరాలయంలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ మంత్రి



మద్నూర్ శివాలయంలో యజ్ఞం..



రామారెడ్డి మండలం మద్దికుంటలో..



గాంధారిలో భోగేశ్వరాలయంలో భక్తుల సందడి



ఎల్లారెడ్డి నీలకంఠేశ్వరాలయంలో..



బాన్సువాడలో శివలింగం శోభాయాత్ర..



బీర్కూర్ మండలం సోమలింగాల వద్ద బారులు తీరిన భక్తులు



లింగంపేట మండలం ప్రభుస్వామి శివాలయంలో..



ఎల్లారెడ్డిలో శివపార్వతుల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

స్పీకర్ కృషితోనే ఆస్పత్రికి గుర్తింపు

బాన్సువాడ టౌన్: బాన్సువాడ మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో అందిస్తున్న సేవలకుగాను జాతీయ స్థాయిలో బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రెడిటేషన్ (గ్రేడ్ 1) లభించడం గర్వకారణమని బీఆర్‌ఎస్ నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డిలు అన్నారు. శనివారం బాన్సువాడ ఎంసీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్‌ను వారు కలిసి అభినందనలు తెలిపారు. ఏడాదిన్నర కిందట బాన్సువాడలో ఆస్పత్రిని ఏర్పాటు చేశారని, అనతి కాలంలోనే జాతీయ స్థాయి గుర్తింపు రావడం వెనుక స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రాంరెడ్డి, ఎజాస్, బుల్లెట్‌రాజు, హకీం, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో..

బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్‌ను దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. సూపరింటెండెంట్‌తో పాటు వైద్య సిబ్బంది చేసిన సేవలకుగాను ఆస్పత్రికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. దళిత హక్కుల పోరా ట సమితి గౌరవ అధ్యక్షుడు అయ్యాల సంతోష్, డివిజన్ అధ్యక్షులు కాదేపురం గంగారం, సభ్యులు ప్రవీణ్ కుమార్, పెంటయ్య, సురేష్, దత్తు, భూషణ్, పరుశరాం, రవి, గంగాధర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

శ్రీశైలానికి శివ స్వాములు

కామారెడ్డి రూరల్: 41 రోజుల పాటు శివ దీక్ష చేపట్టిన పలువురు శివస్వాములు శనివారం శ్రీశైలం, భిక్కనూరు సిద్దరామేశ్వర ఆలయాలకు బయలుదేరి వెళ్లారు. దేవునిపల్లి శివాలయంలో అర్చకుడు శశికాంత్‌శర్మ ఇరుముడి కట్టారు.

పాదయాత్ర..

నస్రుల్లాబాద్(బీర్కూర్): శివరాత్రి సందర్భంగా ఉమ్మడి బీర్కూర్ మండలంలోని పలు క్షేత్రాలకు బీర్కూర్ మండలంలోని పలువురు భక్తులు పాదయాత్రగా వెళ్లారు. ఒక్క రోజులో బీర్కూర్ తెలంగాణ తిరుమల, నెమ్లి సాయి ఆలయం, మైలారం రాజేశ్వరాలయం, దుర్కి సోమేశ్వరాలయం, బాన్సువాడ మండలం బోర్ల బసవేశ్వర ఆలయాలను దర్శించుకొని తిరిగి బయలుదేరి రానున్నట్లు గురు స్వామి సుధాకర్ అన్నారు.



పాదయాత్రగా బయలు దేరిన భక్తులు

పండ్ల ధరలకు రెక్కలు



లింగంపేటలో పండ్ల దుకాణాలు

లింగంపేట: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. భక్తులు ఉపవాస దీక్షలు విరమించిన అనంతరం పండ్లు తీసుకోవడం ఆనవాయితీ. ఇదే అదనుగా తీసుకొని వ్యాపారులు రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నట్లు పలువురు వెల్లడించారు.

మూఢనమ్మకాలను పారదోలాలి



తాడ్వాయి: మూఢ నమ్మకాలను నమ్మొద్దంటూ మండలంలోని క్రిష్ణాజివాడి రాజరాజేశ్వరాలయం ప్రాంగణంలో శనివారం అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మూఢనమ్మకాలను పారదోలి సైన్స్ పట్ల అవగాహన కలిగేలా విద్యార్థులు ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూషణం, ప్రతినిధులు కార్తిక్, వాణిశ్రీ, శ్రీశైలం, గోపాల్‌రావు, దత్తు పాల్గొన్నారు.

హామీల అమలులో సీఎం విఫలం

లింగంపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలం అయ్యారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని ఎల్లారం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని చెప్పినా అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దత్తురాం, ఎల్లమయ్య, అశోక్, మురళి, సాయన్న, పెద్ది శివ్వయ్య, దూరిశెట్టి అశోక్ పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

సదాశివనగర్: మండలంలోని అన్ని గ్రామాలలో బీజేపీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కల్వరాల్‌లో ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ అధికారపార్టీ చేస్తున్న వైఫల్యాలను ప్రజలు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రూపేందర్‌రెడ్డి, భూంరావు, దేవేందర్, గంగారెడ్డి, లింగరావు, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి



కల్వరాల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

సమాచారం..

■ నేడు ఛత్రపతి శివాజీ జయంతి

బీబీపేట: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరమాండ్లు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన అనంతరం మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా రూ. 10 లక్షల విలువైన అంబులెన్సును ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీరూర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భజరంగ్ దల్ సభ్యులు కోరారు. స్థానిక గాంధీ చౌక్‌లోభజరంగ్ దల్ జెండా ఆవిష్కరించి సాయంత్రం శివాజీ విగ్రహ శోభాయాత్ర నిర్వహిస్తామని వెల్లడించారు.

కామారెడ్డి అర్బన్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం కామారెడ్డి ఆర్ట్స్ కళాశాల మైదానం ఎదుట శివాజీ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

■ కుస్తీ పోటీలు..

నస్రుల్లాబాద్: మండలంలోని దుర్కి, మైలారం శివాలయాల్లో ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. పోటీలకు ఇతర రాష్ట్రాల నుంచి మల్లయోధులు రానున్నట్లు తెలిపారు.

రేపు కొర్పోల్‌లో..

లింగంపేట: మండలంలోని కొర్పోల్ కాశీవిశ్వేర ఆలయం వద్ద సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ గాండ్ల మంజుల తెలిపారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయం వద్ద మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించి సోమవారం కుస్తా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

■ 23 నుంచి బ్రహ్మోత్సవాలు

బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్ శ్రీ పద్మావతి సమేత శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు 23 నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ ధర్మకర్త తుప్రాన్ శంకర్‌గౌడ్ తెలిపారు. 24న స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

■ నేడు శివ పార్వతుల కల్యాణం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని పలు శివాలయాల్లో ఆదివారం శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని రాజరాజేశ్వరాలయం, మండలంలోని తిమ్మాపూర్ ఉమా సంగమేశ్వరాలయంలో కల్యాణం నిర్వహిస్తామమని సర్పంచ్ దామోదర్ తెలిపారు. అదేవిధంగా తిమ్మాపూర్‌లో సోమవారం బోనాల పండుగ, మంగళవారం ఉదయం రథోత్సవం, సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు కోరారు.

■ అగ్నిగుండాల ఏర్పాటు

ఎల్లారెడ్డి: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలోని నీలకంఠేశ్వరాలయంలో ఆదివారం అగ్ని గుండాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ పూజారి సంగమేశ్వరప్ప తెలిపారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తామని వెల్లడించారు.